ప్రజల మాట ప్రగతి బాట

# చెన్నూర్ నియోజకవర్గం

# శరవేగంగా బతుకమ్మ ఘాట్‌ల నిర్మాణం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్ కృషితో నిధులు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు, పట్టణ ప్రజలు


మందమర్రిలోని పాలచెట్టు ఏరియాలో పూర్తయిన బతుకమ్మ ఘాట్


సుభాష్ నగర్‌లో కొనసాగుతున్న బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులు

మందమర్రి, అక్టోబర్ 17: తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని ప్రాంతాల్లో బతుకమ్మ పండుగకు ప్రాధాన్యత పెరిగింది. బతుకమ్మ వేడుకల్లో పల్లె, పట్టణాల్లో మహిళలు, యువతులు, చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం ఈ సారి మరింత ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నది.

ఈ మేరకు బతుకమ్మ ఘాట్‌లు(మైదానాలు) నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సింగరేణి పారిశ్రామిక ప్రాంతమైన మందమర్రి మున్సిపాలిటీలో గల 24 వార్డుల్లో బతుకమ్మ ఘాట్‌లను నిర్మించారు. గత ఎన్నికల సమయంలో వేడుకలు నిర్వహించుకునేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌కు మహిళలు వివరించారు. అన్ని వార్డుల్లో బతుకమ్మ మైదానాల నిర్మిస్తానని హామీ ఇచ్చారు.

**24 వార్డుల్లో బతుకమ్మ మైదానాల నిర్మాణానికి కృషి**

మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో బతుకమ్మ మైదానాల నిర్మాణానికి తెలంగాణ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్ఐడీసీ) కింద రూ.1.20 కోట్ల నిధులను మంజూరు చేయించారు. దీంతో మున్సిపాలిటీ అధికారులు వార్డుల్లో బతుకమ్మ ఘాట్‌ల నిర్మాణ పనులు చేపట్టారు. పాలచెట్టు ఏరియా, మూడవ జోన్ ఏరియాల్లో బతుకమ్మ ఘాట్‌ల నిర్మాణం పూర్తయ్యాయి. మరికొన్ని రోజుల్లో ఐదు వార్డుల్లో అందుబాటులోకి రానున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. సద్దుల బతుకమ్మ నాటికి మరో 8 వార్డుల్లో బతుకమ్మ ఘాట్‌లను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. సద్దుల బతుకమ్మ వేడుకల నాటికి 15 వార్డుల్లో బతుకమ్మ ఘాట్‌లు అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు. మిగతా తొమ్మిది వార్డుల్లో స్థల సమస్యతో నిర్మాణం పనులు చేపట్టలేదని, ఆయా వార్డుల్లో స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో బతుకమ్మ వేడుకలకు ప్రత్యేకంగా మైదానాలను నిర్మించడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందుకు కృషి చేసిన ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు రుణపడి ఉంటామని వారంటున్నారు.



**బతుకమ్మ ఘాట్ నిర్మించడం ఆనందంగా ఉంది..**

ప్రతి ఏటా బతుకమ్మ వేడుకల నిర్వహణకు ప్రభుత్వంతో పాటు స్థానిక అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తూ సహకరిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో మా వార్డుకు వచ్చిన ప్రస్తుత ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌కు బతుకమ్మ వేడుకల నిర్వహణకు ఎదురవుతున్న సమస్యను వివరించాం. బతుకమ్మ ఘాట్‌ల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం బతుకమ్మ ఘాట్‌ను నిర్మించారు. విప్ బాల్క సుమన్‌కు కృతజ్ఞతలు.

-కంది కల్పన, మందమర్రి



**పండుగను మరింత ఘనంగా జరుపుకుంటాం..**

బతుకమ్మ ఘాట్‌ల నిర్మాణంతో బతుకమ్మ వేడుకలను మరింత ఘనంగా జరుపుకునే అవకాశం ఏర్పడింది. ఇచ్చిన హామీ మేరకు బతుకమ్మ ఘాట్ నిర్మాణానికి నిధులను మంజూరు చేయించిన విప్ బాల్క సుమన్‌కు రుణపడి ఉంటాం. గతంలో వార్డులో ఒక చోట ఖాళీ ప్రదేశాన్ని చదును చేసుకుని బతుకమ్మ ఆడేటోళ్లం. ఇప్పుడు బతుకమ్మ మైదానంలో ఆడుకునే అవకాశం లభించింది. గత ప్రభుత్వాలు, పాలకులు ఎవరూ మన పండుగలను పట్టించుకోలేదు. బతుకమ్మ మైదానం నిర్మించడం సంతోషంగా ఉంది.

-పొడాల రజిత మందమర్రి

## సోషల్ మీడియా వారియర్స్ సమావేశానికి

# తరలిన బీఆర్ఎస్ శ్రేణులు


చెన్నూర్ : చెన్నూర్ నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్

చెన్నూర్, అక్టోబర్ 17: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలోని ఎంఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా సమావేశానికి చెన్నూర్ పట్టణం నుంచి మంగళవారం బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్ తరలివెళ్లారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా చెన్నూర్ పట్టణ ఇన్‌చార్జి, మున్సిపల్ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రతి వార్డు నుంచి నియమితులైన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్ ఈ సమావేశానికి తరలివెళ్లారు. వీరంతా ప్రత్యేకంగా ఏర్పా టు చేసిన వాహనాల్లో సమావేశానికి బయలుదేరివెళ్లారు.

**కోటపల్లిలో..**

కోటపల్లి, అక్టోబర్ 17 : కోటపల్లి మండలం నుంచి బీఆర్ఎస్ మండల, గ్రామ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు తరలివెళ్లారు. సోషల్ మీడియా ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను, లక్ష్యాలను ఎలా ప్రజల్లోకి తీసుకువెళ్లడం, ప్రతిపక్షాల విమర్శలను సమర్థవంతంగా తిప్పి కొట్టాలో ఈ కార్యక్రమంలో వివరించారు.

**మందమర్రిలో..**

మందమర్రి, అక్టోబర్ 17: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల నుంచి బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ వర్క్‌షాప్‌నకు వారియర్స్ పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మందమర్రి సోషల్ మీడియా ఇన్‌చార్జిలు విరుగురాల వికాస్, సీపెల్లి సాగర్, బెల్లం అశోక్ ఆధ్వర్యంలో మార్కెట్ ఏరియా నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**చెన్నూర్ మండలంలో..**

చెన్నూర్ రూరల్, అక్టోబర్ 17: చెన్నూర్ మండలం నుంచి ఎంపీపీ మంత్రి బాపు, జడ్పీటీసీ మోతె తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్ రెడ్డి, వైస్ ఎంపీపీ వెన్నపు రెడ్డి బాపురెడ్డి ఆధ్వర్యంలో సోషల్ మీడియా వారియర్స్ తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా వారియర్స్ సభ్యులు టీ సంతోష్, కోటపల్లి మండల నాయకులు మారిశెట్టి సాగర్, గ్రామాల నుంచి వారియర్స్ పాల్గొన్నారు,


కోటపల్లి నుంచి..


మందమర్రి నుంచి..


చెన్నూర్ మండలం నుంచి..

## డబ్బు, మద్యం రవాణాను అరికట్టాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్


రాపనపల్లి చెక్‌పోస్టు వద్ద సూచనలు చేస్తున్న కలెక్టర్

కోటపల్లి, అక్టోబర్ 17 : పొరుగు రాష్ట్రాల నుంచి డబ్బు, మద్యం మన రాష్ట్రంలోకి రాకుండా అరికట్టాలని అధికారులు, పోలీసులను మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. కోటపల్లి మండలంలోని రాపనపల్లి గ్రామం సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి వస్తున్న ప్రతి వాహనాన్నీ, వ్యక్తినీ తనిఖీ చేయాలని సూచించారు. రూ.50 వేలకు పైగా డబ్బు తీసుకెళ్తే సీజ్ చేయాలని, ఆధారలుంటేనే వదలాలని సూచించారు. అంతముందు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును అసిస్టెంట్ కలెక్టర్ (రెవెన్యూ) ఎస్ మోతీలాల్, చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి సిడాం దత్తు, ఎన్నికల డీటీ లక్ష్మీ నారాయణ సందర్శించి పలు సూచనలు చేశారు.

## క్షయ వ్యాధి నివారణకు సహకరించాలి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోటపల్లి, అక్టోబర్ 17 : క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీనియర్ ట్రిట్‌మెంట్ సూపర్‌వైజర్ అశోక్ సూచించారు. మండలంలోని లింగన్నపేటలో వైద్యశిబిరం నిర్వహించి క్షయ పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలికంగా దగ్గు, ఆకలి మందగించడం, సాయంత్రం జ్వరం ఉంటే తప్పనిసరిగా క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి సోకితే ఉచితంగా వైద్యం అందించడంతో పాటు పౌష్టికాహారం కోసం ఆరు నెలల వరకు నెలకు రూ.500 చొప్పున బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాగామ రాజు, హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ఎల్ఎల్‌హెచ్‌పీ ఇంద్రజ, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు 'జనహిత' చేయూత

బెల్లంపల్లి, అక్టోబర్ 17: విద్యుదాఘాతంతో ప్రాణపాయస్థితిలో వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న పోగుల లక్ష్మీనారాయణ వైద్య ఖర్చులకు జనహిత సేవా సమితి చేయూతనందించింది. సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో సమకూర్చిన రూ.8 వేల విలువైన చెక్కును సోమవారం రాత్రి సేవా సమితి సభ్యులు లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీశ్, సభ్యులు పెద్ది వినయ్‌కుమార్, గోపే స్వామి, ఆడే సురేందర్, పనాస వెంకటేశ్ పాల్గొన్నారు.

## నిరుపేదల ఆకలి తీర్చడం అభినందనీయం

బెల్లంపల్లి, అక్టోబర్ 17: నిరుపేదల ఆకలి తీర్చడం అభినందనీయమని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ అన్నారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లి హోటల్ యూనియన్ పూర్తి సహకారంతో అమ్మ ఒడి ఎన్జీవో అన్నదాత ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కాంటా చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హోటల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ శెట్టి, పట్టణ అధ్యక్షుడు రేగుంట రాజలింగు, ఉపాధ్యక్షుడు రాచర్ల సంతోష కోశాధికారి కుడికాల శివశంకర్, ప్రధాన కార్యదర్శి దాసారపు రమేశ్, పెద్ది వినయ్‌కుమార్, సభ్యులు భరత్, దుర్గం శ్రీను, అమ్మ ఒడి బ్రాంచ్ మేనేజర్ హన్మాండ్ల మధుకర్, సభ్యులు మల్లక్క, సువర్ణ, అనిరుధ్, సా యిచరణ్, సాయి కార్తికేయ, యూసుఫ్, శ్రీనివాస్, ఖదీర్ పాల్గొన్నారు.

## బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

భీమిని, అక్టోబర్ 17 : ప్రజలు తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని భీమిని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ వేణు అన్నారు. మంగళవారం భీమిని మండల కేంద్రంలో బ్యాంకు అందించే సేవలు, బీమా పథకాలు, పొదుపు పథకాలపై కళాజాత బృందం ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫర్ ఫైనాన్స్ కౌన్సిలర్లు రవి, అశోక్, బ్యాంకు సిబ్బంది, కళాజాత సభ్యులు పాల్గొన్నారు.